ఎడాపెడా విద్యుత్ కోతలు!

- ప్రజలకు తప్పని ఇబ్బందులు
- కుటీర పరిశ్రమలు, చిరు వ్యాపారులకు కష్టాలు
- ఉక్కపోతతో అల్లాడుతున్న వృద్ధులు, చిన్నారులు
- పట్టించుకోని అధికారులు


సి.బెళగల్ విద్యుత్ సబ్ స్టేషన్


సెల్ ఫోన్ రిపేరుకు విద్యుత్ కోతతో ఇబ్బంది పడుతున్న మెకానిక్

సి.బెళగల్: విద్యుత్ కోతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎడాపెడా విద్యుత్ కోతలు విధిస్తుండడంతో కుటీర పరిశ్రమల నిర్వాహకులు, చిరు వ్యాపారులకు కష్టాలు తప్పడం లేదు. సి.బెళగల్ మండలంలో మొత్తం 21 గ్రామాలు ఉండగా చాలా పల్లెలలో అప్రకటిత విద్యుత్ కోతలు విధిస్తున్నారు. ఎప్పుడు కరెంట్ ఉంటుందో ఎప్పుడు ఉండదో తెలియని పరిస్థితి నెలకొంది. కొన్ని రోజులుగా అప్రకటిత విద్యుత్ కోతలు అధికమయ్యాయి. ఉదయం, సాయంత్రం, రాత్రి ఎప్పుడుపడితే అప్పుడు విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. గ్రామాల్లోనూ అదేపరిస్థితి. కుటీర పరిశ్రమలతో పాటు మెకానిక్ పనులు ముందుకు సాగడం లేదు. గత వారం రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నాయి. ఉక్కపోత పరిస్థితులు నెలకొన్నాయి. పగటిపూట ఎండ తీవ్రతతో రాత్రి వేళలు సైతం అదే తరహా ఇబ్బందకర పరిస్థితులు ఉంటున్నాయి. ఇలాంటి సమయంలో రాత్రి విధించే విద్యుత్ కోతలతో చిన్నారులు, వృద్ధులు అవస్థలు పడుతున్నారు. ఉక్కపోతతో అల్లాడుతున్నారు. దీంతో మండల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ముందస్తు సమాచారం లేకుండా విద్యుత్ నిలిపి వేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

అవస్థలు పడతున్న చిరు వ్యాపారులు

అప్రకటిత విద్యుత్ కోతల మూలంగా మండల కేంద్రం సి.బెళగల్‌తో పాటు పల్లెల్లో చిరు వ్యాపారస్తులు ఏర్పాటు చేసుకున్న పిండి మిళ్లలు, విద్యుత్ మోటార్లు, సెల్ ఫోన్ మరమ్మతు షాపుల నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాయంత్రం పిండి మిషన్‌లు పనిచేయకపోవడంతో అవస్థలు పడుతున్నారు. అప్పుడప్పుడు ప్రజలు యజమానులతో ఘర్షణ పడుతున్న పరిస్థితి నెలకొంది. మెకానిక్ పనులు ముందుకు సాగడం లేదు.

పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు



కొన్ని రోజుల నుంచి ఎప్పుడు పడితే అప్పుడు కరెంట్ తీస్తున్నారు. ముఖ్యంగా పొలాల నుంచి రైతులు, ప్రజలు ఇళ్లకు వచ్చే సాయంకాలం, రాత్రి కరెంట్ పోతుండటంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇక ఇళ్లలో పిల్లలు నిద్రపోయిన తరువాత కరెంట్ కట్ అవుతుంది. అప్పుడు చిన్న పిల్లలు, వృద్ధులు చాలా ఇబ్బంది పడుతున్నారు. పిల్లలు ఏడుస్తూ నిద్ర పోవడం లేదు. అధికారులు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి. – మల్లికార్జున, సి.బెళగల్

సకాలంలో రిపేర్లు చేయలేపోతున్నాం



సెల్ ఫోన్ల రిపేర్ల కోసం పల్లె నుంచి ప్రజలు వస్తుంటారు. అయితే రిపేరుకు ఒప్పుకున్న సమయంలో ఇవ్వాలంటే కరెంట్ అవసరం అవుతుంది. ఎప్పుడు పడితే అప్పుడు కరెంట్ పోతుండటంతో మేము ఒప్పుకున్న సమయానికి సెల్ ఫోన్లను బాగుచేసి ఇవ్వలేని పరిస్థితి. ఇకపై ఇలాంటి సమస్య లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. – అరుణ్ కుమార్, సెల్ మెకానిక్

విద్యుత్ సమస్యలను పరిష్కరించాలి



అప్రకటిత విద్యుత్ కోతలతో ఇటు ప్రజలు, అటు చిన్న పరిశ్రమల యజమానులు, మెకానిక్ షాప్‌ల నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు అప్రకటిత విద్యుత్ కోతలు విధించడం అన్యాయం. ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకోవాల్సిన అవసరం ఉంది. విద్యుత్,అధికార యంత్రాంగం విద్య్ుత్ సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలి. – మోహన్, సీఐటీయూ నాయకుడు

ఉరుములు, మెరుపులతో సమస్యలు



మండలంలో ఎలాంటి విద్యుత్ కోతలు లేవు. మండల ప్రజలకు అవసరమైన విద్యుత్ నిరంతరం అందిస్తూనే ఉన్నాం . ఉరుములు, మెరుపుల మూలంగా విద్యుత్ సరఫరాలో కొంతమేర అవరోధాలు ఏర్పడుతున్నాయి. ఎక్కడ సమస్య వస్తుందో ముందే తెలిసే అవకాశం లేకపోవడంతో మరమ్మతులకు కొంత సమయం పడుతుంది. తమవంతుగా మండల విద్యుత్ సిబ్బందిని ఎప్పటికి అప్పుడు అప్రమత్తం చేసి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాం. – సుకుమార్, విద్యుత్ ఏఈ, సి.బెళగల్

క్లుప్తంగా

ఇసుక పంపిణీని పకడ్బందీగా చేపట్టాలి


ఈర్లదిన్నె ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న కర్నూలు ఆర్డీఓ సందీప్‌కుమార్

సి.బెళగల్: ఇసుక పంపిణీనిని పకడ్బందీగా చేపట్టాలని కర్నూలు ఆర్డీఓ సందీప్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన స్థానిక తహసీల్దార్ శ్రీనివాసరెడ్డితో కలిసి తుంగభద్ర నదీతీర గ్రామాలైన ఈర్లదిన్నె, కె.సింగవరం, కొత్తకోటలలో ఏర్పాటైన ఇసుక రీచ్‌లను పరిశీలించారు. ఇసుక బుకింగ్ వాహనాలు, రీచ్‌లకు చేరుకునే వాహనాల వివరాలు, ఇసుక అభ్యత, నిల్వల వివరాలను రీచ్‌ల దగ్గర విధులలో ఉన్న వీఆర్వోలను ఆర్డీఓ అడిగి తెలుసుకున్నారు. రీచ్‌లలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండ చర్యలు తీసుకోవాలని తహసీల్దార్, వీఆర్వోలకు ఆయన సూచించారు. కార్యక్రమంలో వీఆర్వోలు శేఖర్, రామ్మోహన్‌రెడ్డి, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

తడిసిన సోయాబీన్ గింజలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి


సోయాబీన్ గింజలను పరిశీలిస్తున్న రాజశేఖర్

గడివేముల: నాలుగు రోజుల కిందట కురిసిన అకాల వర్షానికి తడిసి దెబ్బతిన్న సోయాబీన్ గింజలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని నంద్యాల జిల్లా ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని పెసరవాయి, కరిమద్దెల గ్రామాల్లో దెబ్బతిన్న సోయాబీన్ గింజలను మంగళవారం ఆయన పరిశీలించి రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకే మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకుడు మద్దిలేటి పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణకు చర్యలు తీసుకోండి


రైతులతో మాట్లాడుతున్న ఏఓ సుధాకర్

ఓర్వకల్లు: పొగాకు పంటలో అక్కడక్కడ ఆకుముడత తెగులు సోకిందని, నివారణకు చర్యలు తీసుకోవాలని ఏఓ సుధాకర్ రైతులకు సూచించారు. మండలంలోని పూడిచెర్ల, కేతవరం గ్రామాలలో మంగళవారం ఏఓ 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. పంట పొలాలను పరిశీంచిన ఏఓ రైతులకు సాగు సూచనలు చేశారు. ఆకుముడత తెగులు నివారణకు జిగురు అట్టలను హెక్టార్‌కు 12–15 చొప్పున ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అలాగే థయోమిథాక్జైమ్ రెండు గ్రాములు, లీటర్ నీటికి/ఎసిఫేట్ 2.5 గ్రాములను లీటర్ నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈఓ భాస్కర్, రైతు సేవా సిబ్బంది అమీర్‌ఖాన్, ఏంజిల్ తదితరులు పాల్గొన్నారు.

ఆశావర్కర్లకు రిటైర్డు బెనిఫిట్స్ అమలు చేయాలి


డాక్టర్ నాగరాజుకు వినతి పత్రం అందజేస్తున్న ఆశా వర్కర్లు

ఓర్వకల్లు: వైద్య శాఖలో అసంఘిటిత కార్మికులుగా పనిచేసుతన్న ఆశావర్కర్లకు రిటైర్డు మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి షాజహాన్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని నన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆశా వర్కర్లు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశావర్కర్ల సమస్యలపై నిర్లక్ష్యం తగదన్నారు. అనంతరం వినతి పత్రాన్ని వైద్యాధికారి డా. నాగరాజుకు సమర్పించారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ల నాయకురాళ్లు కాంతమ్మ, సుశీల, పార్వతి తదితరులుపాల్గొన్నారు.

నేడు మండల సర్వ సభ్య సమావేశం

కల్లూరు: ఎంపీపీ బోయ శారద అధ్యక్షతన బుధవారం కల్లూరు మండల ప్రజా పరిషత్ సర్వ సభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నాగేశ్వరచలరెడ్డి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు హాజరు కావాలని పేర్కొన్నారు.

ఆలమూరులో కొండల్లో మట్టి తవ్వకాలు

పాణ్యం: మండల పరిధిలోని ఆలమూరు గ్రామం సమీపంలో కొండ ప్రాంతాల్లో అక్రమంగా మట్టి తవ్వుతున్నారనే సమాచారం రావడంతో అటవీశాఖ అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. అయితే అటవీభూముల్లో కాకుండా అన్‌రిజర్వు ప్రదేశంలో తవ్వుతున్నట్లు గ్రామస్తులు తెలిపారని అధికారులు తెలిపారు.

అంగన్‌వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

గడివేముల: మండల కేంద్రం గడివేములతో పాటు మంచాలకట్ట గ్రామంలో ఖాళీ అంగన్‌వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని సూపర్‌వైజర్ జయలక్ష్మి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గడివేముల ఆయా పోస్టుకు (బీసీ–బీ), మంచాలకట్ట ఆయా పోస్టుకు (ఈడబ్ల్యూఎస్) అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఫదో తరగతి ఉత్తీర్ణత, 35 సంవత్సరాలలోపు వివాహితులైన స్థానిక మహిళలు అర్హులున్నారు. ఈ నెల 21వ తేదీలోపు నంద్యాల ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

పాణ్యం: మండలంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ ఆయా పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగ సుంకమ్మ గురువారం తెలిపారు. మండలంలోని నెరవాడ -ఓసీ, పాణ్యం-1 బీసీ,ఈ ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. అభ్యర్థులు తప్పని సరిగా 10తరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు. 21-35వయస్సులోపు స్థానిక వివాహిత మహిళలు అర్హులని చెప్పారు. ఎస్టీ, ఎస్సీ జనవాస ప్రాంతాలకు సంబంధించి 21సంవత్సరాలు నిండిన మహిళలు లేకుంటే 18సంవత్సరాలువారిని తీసుకుంటున్నట్లు తెలిపారు. దరఖాస్తులు ఈనెల 10నుంచి 21వ తేదీలోపు నంద్యాల ఈడీపీఓ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

12 నుంచి కబడ్డీ పోటీలు

కర్నూలు (రూరల్) : మండల పరిధిలోని గొందిపర్ల గ్రామంలో విజయదశమిని పురస్కరించుకుని 12, 13 తేదీలలో ఓపెన్ కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీటీసీ కృష్ణవేణి తెలిపారు. విజేత జట్లకు దాతల సహకారంతో నగదు బహుమతులు అందజేస్తామన్నారు. మొదటి, రెండవ, మూడవ, నాల్గవ బహుమతులు వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు చొప్పున అందజేస్తామన్నారు. పోటీల్లో పాల్గొనేందుకు జట్లు ఎంట్రీ ఫీజు రూ.500 చెల్లించాల్సి ఉంటుందన్నారు.

పంట నమోదు పకడ్బందీగా చేయాలి


వెంకటగిరిలో పంట నమోదును క్రాస్ చెక్ చేస్తున్న జాయింట్ కలెక్టర్ నవ్య

కోడుమూరు రూరల్ : రైతులు సాగు చేసిన పంటల నమోదు ప్రక్రియ రెవెన్యూ, వ్యవసాయ సిబ్బంది పకడ్బందీగా చేపట్టాలని జాయింట్ కలెక్టర్ నవ్య సూచించారు. మండల పరిధిలోని వెంకటగిరిలో ఖరీఫ్ కింద రైతులు సాగు చేసిన పంటల నమోదు ప్రక్రియను మంగళవారం జేసీ పరిశీలించారు. పంట నమోదును క్రాస్ చెక్ చేశారు. జేసీ మాట్లాడుతూ పంటలు సాగు చేసిన రైతు పేరునే నమోదు చేయాలన్నారు. కౌలు భూములకు సంబంధించి కౌలురైతు పేరునే నమోదు చేయాలని సూచించారు. జేసీ వెంట కోడుమూరు తహసీల్దార్ వెంకటేష్ నాయక్, ఏఓ రవిప్రకాష్, రెవెన్యూ, వ్యవసాయశాఖ సిబ్బంది ఉన్నారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ సాలురెడ్డి

సి.బెళగల్: ఆధునిక వ్యవసాయ పద్ధతులను పాటించి అధిక దిగుబడులను పొందాలని కర్నూలు ఏడీఏ సాలురెడ్డి రైతులకు సూచించారు. మంగళవారం సి.బెళగల్ మండలంలోని పోలకల్ గ్రామంలో ఏఓ మల్లేష్‌కుమార్ పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రైతులను ఉద్దేశించి ఏడీఏ మాట్లాడారు. వ్యవసాయ యాంత్రీకరణ పద్ధతులను ఏడీఏ వివరించారు. అనంతరం పంటపొలాలను సందర్శించి పైరు సంరక్షణపై రైతులకు సూచినలు చేశారు. కార్యక్రమంలో ఏఈఓ సిద్ధు, ఎంఈపీఈఓ వెంకటేష్, వీఏఏ భరత్, అఫ్రీన్, భాస్కర్ రైతులు పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్ హామీని అమలు చేయాలి


ఏఈ మధుసూదన్‌కు వినతి పత్రం అందజేస్తున్న చేనేత కార్మిక సంఘం నాయకులు

కోడుమూరు రూరల్ : కూటమి ప్రభుత్వం చేనేతలకు ఇచ్చిన ఉచిత విద్యుత్ హామీని వెంటనే అమలు చేయాలని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాధవస్వామి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ట్రాన్స్‌కో కార్యాలయంలో ఏఈ మధుసూదన్‌కు నాయకులలో కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు. అనంతరం మాధవస్వామి మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి నాయకులు చేనేతలకు 200 యూనిట్లు ఉచితంగా అమలు చేస్తామని హామి ఇచ్చారని గుర్తు చేశారు. అయితే అధికారం చేపట్టి నాలుగు నెలలు గడిచినా తమకు ఇచ్చిన హామీపై స్పందించకపోవడం అన్యాయమన్నారు. నేసిన చీరలకు డిమాండ్ లేక, చేసేందుకు పనులు లేక చేనేత కార్మికులు దుర్భర జీవితాలు గడపుతున్నారని, ప్రభుత్వం స్పందించి వెంటనే ఉచిత విద్యుత్ హామీని అమలు చేసి ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

సాగైన ప్రతి పంట నమోదు


రైతులతో మాట్లాడుతున్న జేసీ విష్ణు చరణ్

గడివేముల: ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగుచేసిన ప్రతి పంటను ఈ–పంట నమోదు చేసినట్లు నంద్యాల జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని గని గ్రామంలో ఈ పంట నమోదును జేసీ పరిశీలించారు. ఏ పంట సాగు చేశారో పొలాల వద్దకు పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఈ పంట నమోదు చేసిన రైతుల పేర్లను ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల వద్ద ఉంచడం జరిగిందన్నారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే స్థానిక వ్యవసాయాధికారులకు తెలియజేయాలన్నారు. ఈ పంట ద్వారా కలిగే లాభాలను రైతులకు వ్యవసాయాధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ, ఏడీఏ నాగరాజు, తహసీల్దార్ వెంకటరమణ, ఏఓ హేమసుందర్ రెడ్డి, వీఆర్వో, వీఏఏలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌యూలో అక్రమాలపై విచారణ చేయాలి



ఆర్‌యూ ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయంలో జరిగిన అవినీతి, అక్రమాలపై ప్రభుత్వం విచారణ చేపట్టాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్‌యూ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప, భీమ్ ఆర్మీ రాష్ట్ర కన్వీనర్ విజయభాస్కర్, అంబేడ్కర్ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మధుకృష్ణ మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కాంట్రాక్టు, నాన్ టీచింగ్ ఉద్యోగులకు అక్రమంగా టైమ్ స్కేల్ ఇచ్చి హెచ్‌ఆర్‌ఏ, ఐఆర్ వర్తింపజేస్తూ పదోన్నతులు కల్పించారని ఆరోపించారు. టైమ్ స్కేల్ ఉద్యోగులను నిబంధనలకు విరుద్ధంగా రెగ్యులర్ చేశారన్నారు. విద్యార్థులు చెల్లించిన ఫీజులను విద్యార్థుల సంక్షేమానికి వినియోగించకుండా నాన్ టీచింగ్ ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తున్నారని విమర్శించారు. వీటన్నింటికీ పాలకమండలిలో ఆమోదం లేకున్నా అమలు చేస్తున్నారని ఆరోపించారు.


కోడుమూరు: శ్రీమహాలక్ష్మిదేవిగా శ్రీవల్లెలాంబదేవి


శ్రీమంగళ గౌరీదేవిగా...


మహాలక్ష్మి రూపంలో..


కర్నూలు (రూరల్) : లక్ష్మీ దేవిగా దర్శనమిచ్చిన వెంకాయపల్లె ఎల్లమ్మ

వైభవంగా శరన్నవరాత్రోత్సవాలు


సి.బెళగల్: ఈశ్వరాలయలో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు


శ్రీమహాలక్ష్మి దేవి అలంకరణలో శ్రీసుంకుల పరమేశ్వరీ

కోడుమూరు రూరల్: దసరా శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనమివ్వగా భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని శ్రీకన్యకాపరమేశ్వరీ, శ్రీచౌడేశ్వరీ దేవి, శ్రీకాళికామాతా, శ్రీరాములమ్మ, శ్రీతులజా భవాని, శ్రీమాతా అంబా భవాని, శ్రీవల్లెలాంబదేవి ఆలయాల్లో శ్రీమహాలక్ష్మి, శ్రీమంగళ గౌరీదేవిగా దర్శనమిచారు. అలాగే శ్రీవల్లెలాంబదేవి ఆలయంలో శ్రీమహాలక్ష్మిగా దర్శనమిచ్చారు. అమ్మవారిని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి కుమారుడు కోట్ల రాఘవేంద్రరెడ్డి, కోడుమూరు సర్పంచ్ భాగ్యరత్న, మాజీ సర్పంచ్‌లు సీబీ.లత, కేఈ రాంబాబు, మాజీ సింగిల్‌విండో అధ్యక్షులు హేమాద్రిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారు అమ్మవారి పల్లకి సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కోడుమూరు జెడ్పీటీసీ రఘునాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

గూడూరులో...

దసరా శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా మంగళవారం గూడూరు మండలంలోని అమ్మవారి ఆలయాల్లో భక్తులు విశేష పూజలు నిర్వహించారు. శ్రీమాతా అంబ భవాని ఆలయంలో శ్రీమహాలక్ష్మి అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. కె.నాగలాపురంలో వెలసిన శ్రీసుంకులా పరమేశ్వరీ శ్రీమహాలక్ష్మి అలంకరణలో కనువిందు చేశారు.

సి.బెళగల్: దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా స్థానిక ఈశ్వరాలయంలో కొలువైన అమ్మవారు మంగళవారం మహాలక్ష్మి దేవిగా దర్శనమిచ్చారు. పూజారి సుదర్శణాచార్యుల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా కొత్తకోట గ్రామంలోని ప్రధాన వీధిలో ఏర్పాటు చేసిన అమ్మవారిని భక్తులు దర్శించుకుని పూజలు చేశారు.

కర్నూలు (రూరల్) : మండల పరిధిలోని వెంకాయపల్లె ఎల్లమ్మ అమ్మవారు మంగళవారం లక్ష్మీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ఓర్వకల్లు: దసరా ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవార్లు మహాలక్ష్మిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు అమ్మవారికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు భక్తులకు అమ్మవారి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

పాణ్యం: దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారు ప్రతి వివిధ రూపాల్లో భక్తులకు దర్శమిచ్చారు. దేవాదాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారు శ్రీకాత్యాయిని దేవిగా భక్తులను ఆరించారు. శ్రీ కాన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు మహలక్ష్మీగా దర్శమిచ్చారు. హైంధవశక్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారిని నిర్వహకులు మహలక్ష్మీగా అలంకరించారు.

గడివేముల: మండల కేంద్రం గడివేములలో వెలసిన శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో మంగళవారం లలితాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు వసంతలక్ష్మి, సత్యనారాయణ శర్మ లలితాదేవి అష్టోత్తర శతనామావళి పటించడంతో పాటు కుంకుమార్చన, గణపతి హోమం వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు బొంతల మధుసూదన్ గుప్తా, ఉపాధ్యక్షులు సతీష్ కుమార్, మల్లికార్జున, కార్యదర్శి సీవీ రమణయ్య, ఉప కార్యదర్శి సురేష్ కుమార్ తదితరులు దర్శించుకుని పూజలు చేశారు.


ఓర్వకల్లు: మహాలక్ష్మీదేవిగా దర్శనమిస్తున్న అమ్మవారు


పాణ్యం : కాత్యాయిని దేవి అలంకరణలో అమ్మవారు


మహాలక్ష్మి రూపంలో..


గడివేముల: లలితాదేవి అలంకరణలో అమ్మవారు

డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

పాణ్యం: మండల కేంద్రం పాణ్యంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలో ప్రవేశాల కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శివారెడ్డి తెలిపారు. బీ.కామ్ కంప్యూటర్–10, బీఏ పొలిటికల్ సైన్స్ 10, బీఎస్‌ఈ 12 సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. స్పాట్ అడ్మిషన్ ద్వారా భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఇంటర్ పాసైన విద్యార్థులు అవసరమై ధృవీకరణ పత్రాలతో ఈ నెల 11వ తేదీలోపు దరఖాస్తులు అందజేయాలన్నారు. వివరాల కోసం సెల్ 9866041775 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

14 మద్యం దుకాణాలకు 230 దరఖాస్తులు

కోడుమూరు రూరల్ : కోడుమూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని 14మద్యం దుకాణాలకు మంగళవారం సాయంత్రానికి 230దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సీఐ మంజుల తెలిపారు. సీఐ మాట్లాడుతూ కోడుమూరు మండలంలో 5 మద్యం దుకాణాలు, గూడూరు 3, వెల్దుర్తి 3, సి.బెళగల్ 2, క్రిష్ణగిరి మండలం 1 చొప్పున మొత్తం 14మద్యం దుకాణాలను కేటాయించడం జరిగిందన్నారు. వీటికి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు 9వతేదీ సాయంత్రం 5గంటల వరకు అవకాశముందని చెప్పారు. 9వతేదీ వరకు వచ్చిన దరఖాస్తులకు సంబంధించి 11వతేదీ కర్నూలు జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలో లాటరీ పద్ధతిన ఎంపిక చేసి దుకాణాలను కేటాయించడం జరుగుతుందని సీఐ పేర్కొన్నారు.

నేడే చివరి రోజు

గడివేముల: నూతన మద్యం పాలసీ దరఖాస్తుకు బుధవారం ఒక్కరోజు మాత్రమే గడువు ఉందని నంద్యాల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి తెలిపారు. ఆయన మాట్లాడుతూ గడివేముల మండలంలో రెండు మద్య షాపులు ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతిచ్చిందన్నారు. ఇప్పటి వరకు 18వ షాపుకు 12 అప్లికేషన్లు, 19వ షాపుకు 9 అప్లికేషన్లు వచ్చాయన్నారు.